గృహ సారధులే పార్టీకి కీలకం : ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : క్షేత్రస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గృహసారధులే ఎంతో కీలకమని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజక వర్గ ఇన్‌చార్జీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. ఆయన గురువారం మండ లంలోగల కోటబొమ్మాళి, రేగులుపాడు సచివాలయాల పరిధిలోగల సర్పంచ్, ఎంపీటీసీ, వార్డు మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు గృహసారధు లతో మా నమ్మకం నువ్వేజగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అమలులో పార్టీ తరపున ప్రజలకు సేవలందించడానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. కుల, మతాలకు పార్టీలకు అతీతంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలను కోరారు. నూతనంగా నియమించబడిన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు విధివిధానాలపై అవగాహన కల్పించారు. అలాగే గ్రామంలో పర్యటించి వృద్ధులతో, యువతతో జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన గూర్చి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా వస్తున్న పట్టభద్రుల ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జీ గడ్డవలస నాగభూషణరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దుక్కరోజారామక్రిష్ణ, బోయిన నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు నూక సత్యరాజు, మండల విప్ బొడ్డు అప్పన్న, స్థానిక సర్పంచ్ కాళ్ళ సంజీవరావు, బోయిన క్రిష్ణరావు, కొత్తమ్మతల్లి ట్రస్టుబోర్డు చైర్మన్ బోయిన మాధవి, పట్టణ అధ్యక్షుడు డబ్బీరు ప్రదీప్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వంశధార విద్యాసంస్థల అధినేత చింతాడ అనిరుద్దుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా 'సీతంరాజు'ను గెలిపించండి

పలు విద్యాసంస్థల్లో ఎమ్మెల్యే, 'ధర్మాన' ప్రచారం

విశాలాంధ్ర-నరసన్నపేట : రాష్ట్ర ముఖ్యమంత్రి, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన శీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్ అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని పలు విద్యా సంస్థలను సందర్శించి, ఎమ్మెల్సీ అభ్యర్థి శీతంరాజు సుధాకర్ గెలుపు కోసం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ బ్యాలట్ పేపర్లో 3వ సీరియల్ వద్ద 1వ నంబర్ వేసి, మంచి మెజార్టీతో సుధాకర్‌ను గెలిపించాలని కోరారు. అధికార పార్టీ అభ్యర్థిని గెలిపించుకుంటే సమస్యలు పరిష్కరించుకోవటం సాధ్యమవుతోందని తెలిపారు. ఈ సందర్భంగా గీతాంజలి స్కూల్ యాజమాన్యం తరుపున రాజమహంతి శ్రీనివాసరావు, కె.శివప్రసాద్ తదితరులు ఎమ్మెల్యే కృష్ణదాస్‌కు ఘనంగా శాలువతో సత్కరించారు.

ప్రతాప్ వైపే పట్టబద్రుల దృష్టి

విశాలాంధ్ర-పొందూరు : ఉద్యమ పోరాటాల పురిటి గెడ్డ పొందూరు ప్రజా సమస్యలపై నిలదీతలో నిప్పు రవ్వలా, అవినీతిపై పోరాటాలంటేనే పరుగులు తీసేది జై ప్రతాప్‌కే సొంతం. న్యాయం కోసం ఎంత దూరమైనా వెళ్లి ఉరకలేసే ఊపిరి జై ప్రతాప్ కే సాధ్యమన్న మాట పొందూరు పుడమి గట్టు చెబుతుంది. అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, పిన్న వయస్సు నుండి అవినీతిని ప్రశ్నిస్తూ ఉరకలేసే ఉద్యమమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో నిలవాలని యువ ప్రోత్సవానికి నాంది పలికారు. ఉద్యమాల్లో నిప్పురవ్వలా, పోరాట పటిమలో రాజీలేని ఉద్దండుడూలా, పిట్ట కొంచెమైనా కూత ఘనమైన మార్గ మైందని ఇక్కడి అభ్యుదయ వాదుల ఆనందం అంతు పట్టలేనిదయింది. జై ప్రతాప్ ఏపార్టీలో ఉన్న ప్రజా సమస్యలపై అతని పోరుబాట వల్లే నేటి యువతరం అండగా నిలుస్తుంది. గెలుపు వాటములు ఎలా ఉన్నా? జై ప్రతాప్ ను ఆదరించే తీరు చూపరుల్లో ఆనందం వెల్లి విరుస్తుంది. నీతివంతమైన రాజకీయాలకు నిలువుటద్దంలో కనిపించే జై ప్రకాష్ నారాయణ అడుగుజాడల్లో కదం తొక్కిన జై ప్రతాప్ కుమార్ కు విద్యావంతులు ఘనంగా ప్రోత్సహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు వంటిపట్టలేని నిరుద్యోగుల కన్నీటి ఘోష, కాంట్రాక్టు ఉద్యోగుల వయస్సు మళ్లీనా క్రమీబద్ధకరణ లేక సర్కార్ వట్టి చాకిరికి బలైపోతున్న విషయాన్ని జీర్ణించుకోలేని మనస్థాపమే ఎమ్మెల్సీ పోరు బాటలో శంఖారావాన్ని పూరించారు. మరోవైపు ఉపాధ్యాయ, ఉద్యోగుల, ఉద్యమాన్ని సర్కారుకబంద హస్తాలతో అణగదొక్కే దుష్పరిపాలనకు ప్రత్యక్ష ఉద్యమమే సాధ్యమని శ్రేయోభిలాషులు, మిత్రులు, ఉద్యమకారుల ఒత్తిడితో ఎన్నికల బరిలో కదం తొక్కుతున్న బందారు ఎస్ వి జె ప్రతాప్‌కుమార్‌కు మీ బిడ్డగా ఆశీర్వదించి ఒకటో ప్రాథమిక ఓటువేసి గెలిపించాలని కోరుతూ వాడవాడలా అభిమానులు, యువకులు, విద్యావంతులు నిరుద్యోగులు మేధావి వర్గాలు చాప కింద నీరుల ప్రచారం చేస్తున్నారు. జై ప్రతాప్ గెలిపే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా ఉద్యోగులు, నిరుద్యోగులు,యువత పనిచేసే తీరును చూసి చూపరులు అభినందిస్తున్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర-పలాస: పలాస సబ్ డివిజన్ పరిధి 33కెవి మందస, 33కెవి సోంపేట విద్యుత్ లైన్‌లో దెబ్బతిన్న స్థంబాలు మార్చేందుకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని విద్యుత్ శాఖ ఇ.ఇ రాజశేఖర్ (టెక్కలి) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11కెవి శ్రీనివాసనగర్, 11కెవి నెమలికొండ, ఎంపిడిఓ కార్యాలయం రోడ్డు, శ్రీనివాసనగర్, పాత జాతీయ రహదారి, రోటరీనగర్, నెహ్రూనగర్, ఎన్ఎన్.పురం మరియు పలాస ప్రభుత్వ కళాశాల రోడ్డు, వాసుదేవుపేట, మొగిలిపాడు, తహశీల్దార్ కార్యాలయం రహదారి, పలాస ఆర్డీవో కార్యాలయం రహదారి, శాసనం, గాంధీనగర్-2, రాజమ్మకాలనిలో ప్రాంతాల్లో విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

కొత్త అంపురంలో ఉచిత కంటి వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కంచిలి : మండలంలోని కొత్త అంపురం గ్రామంలో గురువారం హెల్ప్ ఏజ్ ఫౌండేషన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోంపేట ఆరోగ్యవరం కంటి ఆసుపత్రి వైద్యులు కిరణ్ తదితరులు రోగులను పరీక్షించారు. నిర్వాహకులు మాట్లాడుతూ 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 13 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించినట్లు తెలిపారు. అలాగే మరో 10 మందికి శస్త్ర చికిత్సలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఇటువంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని హెల్ప్ ఏజ్ సంస్థ ప్రతినిధులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహిని, గ్రామ పెద్దలు ఎం అప్పారావు, ఎం మోహన్‌రావు, ఏఎన్ఎం లలిత, ఆశా వర్కర్లు, సంస్థ ప్రతినిధులు పాల్గొని సహకారం అందజేశారు.

రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీలకు జిల్లా జట్టు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : ఈ నెల 10 నుండి 12వ తేదీ వరకు యలమంచిలి వైయస్సార్ ఇండోర్ స్టేడియంలో జరుగునున్న 40వ సబ్ జూనియర్, 5వ క్యాడట్ రాష్ట్రస్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొన్నటువంటి క్రీడాకారు లతో నగరంలోని స్థానిక బాలుర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గురువారం ఉదయం టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు ఆధ్వ ర్యంలో టీంలను పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 19వ తారీఖున జరిగిన జిల్లా స్థాయి టైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారందరూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లా నుంచి 31 మంది వివిధ విభాగాల్లో పాల్గొంటున్నారని రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించిన వారు ఈనెల 28 నుంచి 31వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగిన జాతీయ స్థాయి టైక్వాండో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్య సలహాదారులు వి.సుందరరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు శాసపు జోగినాయుదు, జి ఇందిరా ప్రసాదరావు, వుషు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్, కురిటి తారకరామ, రెడ్డి సాయిరాం, కొమర మోహన్ కృష్ణ, సకుముల్ల శివాజీ, ముద్దాడ శిరీష, తదితరులు పాల్గొన్నారు. బాలుర టీంకు కురిటి తారకరామా, జి లక్ష్మణరావు, బాలికల టీంకు ముద్దాడ శిరీష, ధనలక్ష్మి కోచ్ ఎండ్ మేనేజర్స్‌గా వ్యవహరిస్తారు. పాల్గొన్నటు వంటి క్రీడాకారుల వివరాలు వరుసగా సబ్ జూనియర్ విభాగంలో పి గగన్, బి శౌర్య, కే సాక్షిత్, వి రిషికేష్, ఆర్ నరేంద్ర నాయుడు, డి లీలా మాధవ్, సిహెచ్ గౌతమ్ సిద్ధార్థ, జి రోహిత్, సిహెచ్ యశ్వంత్, ఎస్ సేతునందన్, పి పవన్, ఆర్ చతుర సాయి ప్రీతం సబ్ జూనియర్ బాలికలు : డి.త్రివేణి, ఎం సంజునా, సిహెచ్ మేఘ వర్షిత, ఎస్ భవిజ్ఞ, ఎం జోషిక, పి యషిత, బి దేవి ప్రియ, వి.చాతుర్య, సిహెచ్ తరణి, కే నందిని, ఎస్.శ్రీశాన్వి క్యాడేట్ బాలురు విభాగంలో ఏ ప్రశాంత్ కుమార్, టి. దిల్లేశ్వరరావు, ఏ ప్రేమ్ కుమార్, బి హిమచందన్, ఏ పూర్ణచంద్రరావు, ఏ దేవి ప్రసాద్, జి రిత్విక్ లోకేష్ క్యాడిట్ బాలికల విభాగంలో ఆర్ తన్మయి, ఆర్ హర్షిత చౌదరి పాల్గొంటున్నారు.

సేవకు చిరునామా ప్రముఖ గైనకాలజిస్ట్ దానేటి శ్రీధర్

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- ఉద్దానం కిడ్నీ బాధితులకు రూ.5 లక్షలు ప్రకటన

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: సేవకు చిరునామా ప్రముఖ గైనకాలజిస్ట్ దానేటి శ్రీధర్ అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని శ్రీకాకుళం సింహద్వారం సమీపంలోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం ప్రముఖ గైనికాలజిస్ట్ దానేటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన ప్రసాదరావు డాక్టర్ శ్రీధర్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ నిజాయితీ కలిగిన డాక్టర్, సేవకు ముందడుగు వేసి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే మనస్తత్వంతోపాటు ఎల్లప్పుడూ ఇతరుల కోసమే ఆలోచించే తత్వం, రోల్ మోడల్ మన దానేటి శ్రీధర్ అన్నారు. అనంతరం ప్రముఖ గైనికాలజిస్టు డాక్టర్ దానేటి శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా వాసులకు అత్యాధునిక మైన వైద్యసేవలు అందించేందుకు ఎల్లప్పుడూ తపిస్తానన్నారు. ఎన్ని కార్యక్రమాలు చేస్తున్న పేద లకు అందించే సేవలోనే నిజమైన సంతప్తి ఉంటుందన్నారు. తన పుట్టినరోజును పేదల మధ్య, అభిమానుల మధ్య జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయన తన వద్దకు వచ్చే వారికి 50 శాతం రాయితీతో రెండు నెలలపాటు ఐవీఎఫ్ చికిత్స అందిస్తాన న్నారు. అలాగే ఉద్దానం కిడ్నీ బాధితుల కోసం రూ.ఐదు లక్షలు, టీబీ రోగుల కోసం రూ.లక్ష ప్రకటించారు. అలాగే తలసేమియా, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహా రం అందజేశారు. దానేటి శ్రీధర్ పుట్టినరోజు సంద ర్భంగా ఆయన అభిమానులు జెమ్స్, న్యూ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో సుమారు 200 మంది ఉచితంగా రక్తదానం చేశారు. అలాగే నగరంలోని అనాథశ్రమాలకు రెండు పూటలా ఉచితంగా భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ధానేటి శ్రీధర్‌కు వైసీపీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎంఎల్‌సీలు పాలవలస విక్రాంత్, దువ్వాడ శ్రీనివాస్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కపారాణి, శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి పద్మావతి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎం.వి స్వరూప్, అంధవరపు ప్రసాద్, సంతోష్, ప్రముఖ వైద్యులు గూడేన సోమేశ్వర రావు, పీజె నాయుడు, సీపాన రాజేష్, మెడికవర్ క్లస్టర్ హెడ్ పద్మజ, సాగరిక, జెమ్స్ ఆసుపత్రి ఎండీ బొల్లినేని భాస్కర రావు, రామ్మోహన్‌తోపాటు, లయన్స్ క్లబ్ ప్రతిని ధులు నటుకుల మోహన్, బాడాన దేవభూషణ రావు, పొన్నాడ రవికుమార్, మీడియా జెఏసీ కన్వీనర్ శాసపు జోగినాయుడు, గోపాల్ ఫిట్ నెస్ అధినేత పి.గోపాల్, బాడీబిల్డింగ్ అసోసియేషన్ అసోసియేట్ రాష్ట్ర కార్యదర్శి వి.విజయ్‌కుమార్, ప్రముఖులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

వైసీపీ మద్దతుదారు సీతాం రాజు గెలుపునకు కృషి

వైస్ ఎంపీపీ లోతుగెడ్డ

విశాలాంధ్ర-కొత్తూరు : మరో రెండు రోజుల్లో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో వైసీపీ బలపరిచిన సీతాంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఫోన్ ద్వారా ఓటర్లయినా పట్టభద్రులతో నేరుగా మాట్లాడే కార్యక్రమానికి పాతపట్నం నియోజకవర్గ నాయకులు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు శ్రీకారం చుట్టారు. గురువారం తన కార్యాలయం నుండి పలువురుకు ఫోన్‌చేసి సీతారాంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని లోతుగెడ్డ అభ్యర్థించారు. ఈ ఫొటొ కార్యక్రమంపై అయన విశాలాంధ్రతో మాట్లాడుతూ పాతపట్నం నియోజకవర్గంలో 4 వేలకు పైగా పట్టభద్రులైన ఓటర్లుండగా అందులో దాదాపు 80 శాతంపైగా వారితో తాను ఫోన్‌చేసి అభ్యర్థించినట్లు లోతుగెడ్డ తెలిపారు. పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయి. వైసీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని ఆయన అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ జోరుగా ప్రచారం



విశాలాంధ్ర-కొత్తూరు : ఉత్తరాంధ్ర పట్టబద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలుగుదేశం బలపరిచిన వేపాడ చిరంజీవులను ఓటు వేసి గెలిపించాలని కోరుతూ మండల టీడీపీ యువ త అధ్యక్షులు చింతాడా కోటేశ్వరరావు మరియు టీమ్ గురువారం మండలంలోని వివిధ గ్రామాల్లో పట్టబద్రులైన ఓటర్లను స్వయంగా కలిసి కరపత్రాలు, నమూనా బేలెట్ పత్రాలను అందజేశారు. తొలి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి గెడ్డవలా. కమలాకార్, గెదల సోమేశ్వరరావు, సీతారాం మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడు రాజశేఖర్‌కు ఉత్తరాంధ్ర పార్టీ సంపూర్ణ మద్దతు

విశాలాంధ్ర-జలుమూరు : ఉత్తరాంధ్ర పట్టభద్రుల స్వతంత్ర ఎమ్మెల్సీ అభ్యర్థి నాయుడు రాజశేఖర్‌కు ఉత్తరాంధ్ర పార్టీ అధ్యక్షులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మెట్ట రామారావు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈసందర్భంగా నాయుడు రాజశేఖర్ రామారావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి సామాన్యుడైన శ్రీ ముఖలింగేశ్వర ఆలయ ప్రధాన అర్చకులు నాయుడు రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని కోరారు.

డియల్ పురం సర్పంచ్ మృతి

విశాలాంధ్ర-పోలాకి : ద్వీచక్ర వాహనం నడుపుతూ అదుపుతప్పడంతో సర్పంచ్ తమ్మేనేని అప్పలనాయుడు(64) మృతిచెందారు. గురువారం దండులక్ష్మీపురం పంచా యతీ నుండి సత్రావుపేట గ్రామానికి వాహనంపై వెళ్తుండడతో ప్రమాదం జరిగింది. వెంటనే శ్రీకాకుళం ప్రయివేట్ వైద్యశాలలో మెరుగైన వైద్యం పొందుతూ మృతిచెందారు. గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. మృతుడు ఇటీవల వైసిపి మద్దత్తు తో సర్పంచ్ గెలిపొందారు. గతంలో ఈయన మండల సర్వేయర్‌గా సేవలందించారు. మృతుడుకి కుమార్తె భార్య ఉన్నారు.

ఉద్యోగులు, ఉపాధ్యాయులపై వేధింపులు ఆపాలి

సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్

విశాలాంధ్ర-పలాస : తమ న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు చేస్తున్న పోరాటాలకు ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తుందని, వాటిని ఆపాలని సిపిఐ పలాస నియోజకవర్గ కన్వీనరు చాపర వేణుగోపాల్, సిపిఎం నాయకులు రెయ్యిల గణపతిలు అన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు చేస్తున్న ఆందోళనలకు మద్దతుగా గురువారం కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని, సిపిఎస్ రద్దు చేయాలని అడిగితే కేసులు బనాయించి నిర్బంధిస్తున్నారని అన్నారు. ప్రశ్నిస్తే అణచివేస్తామని, ప్రభుత్వం అనుకోవడం సిగ్గుచేటని, ఉద్యోగులకు ఇచ్చిన హామీల ప్రకారం సిపిఎస్ రద్దు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులపై పెట్టిన కేసులు ఎత్తివేసి ప్రతి నెల సకాలంలో జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగులతో సహా అందర్ని కలుపుకొని పోరాడుతామని హెచ్చరించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉద్యోగులకు ఎలా ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్నా, శాంతారావు, ఎన్.ఢిల్లేశ్వరరావు, కె.హేమసుదన్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల పోలింగుకు సర్వం సిద్ధం : కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర -శ్రీకాకుళం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల మరియు స్థానిక సంస్థల శాసనమండలి ఎన్నికలకు సంబంధించి సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. ఎం.ఎల్.సిల ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మరో 4 రోజుల్లో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు దాదాపు పూర్తిచేసామన్నారు. జిల్లాలో ఎటువంటి సమస్యలు లేవన్నారు. బ్యాలెట్ పేపర్లు పొందడం జరిగిందని, వాటిని పరిశీలించి ముగ్గురు ఆర్.డి.ఓలకు శుక్రవారం పంపేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఇందుకోసం రిసెప్షన్ సెంటర్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. జిల్లాకు అవసరమైన బ్యాలెట్ పేపర్లతోపాటు అదనపు బ్యాలెట్ పేపర్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో వెబ్ కాస్ట్‌తోపాటు ఇతర మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు. పోస్టల్ బ్యాలెట్ పేపర్లను కూడా సిద్ధం చేశామని, వాటిని శుక్రవారం పంపిణీ చేయనున్నట్లు వివరించారు. పోలింగ్ విధానంపై పి.ఓ,ఏ.పి.ఓ, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్ట్రాంగ్ రూమ్‌లకు పంపేందుకు రవాణా సదుపాయాలను ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. కౌంటింగ్ ప్రక్రియ విశాఖలో ఉన్నందున ఆ ప్రక్రియపై సిబ్బందికి విశాఖలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల కొరకు స్ట్రాంగ్ రూమ్‌ను నగరంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటుచేసినట్లు కలెక్టర్ వివరించారు. స్ట్రాంగ్ రూమ్ మొత్తం సిసి కెమెరాల నిఘాలో ఉందన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తక్షణమే బ్యాలెట్ బాక్సులను విశాఖపట్నంకు తరలించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎక్కడా ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, బ్యాలెట్ బాక్సులు సీల్ చేసినపుడు, ఓపెన్ చేసే సమయాల్లో వీడియో తప్పనిసరిగా తీయించాలని సి.ఈ.ఓ కలెక్టర్లను కోరారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, జిల్లా పంచాయతీ అధికారి వి.రవికుమార్, మెప్మా, గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎం.కిరణ్ కుమార్, ఎన్.గణపతిరావు, ఆర్.టి.సి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌చార్జి

విశాలాంధ్ర-రణస్థలం : మండలం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలమేరకు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ వైయస్సార్ విద్యార్థి విభాగం జోనల్ ఇన్‌ఛార్జ్‌గా శ్రీకాకుళం జిల్లా, పార్వతీపురం జిల్లా, అల్లూరి సీతారామరాజు జిల్లాల జోనల్ ఇన్‌చార్జ్ గా నియమితులైన ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం జె.ఆర్.పురం పంచాయతీకి చెందిన వద్దాది పాణి కుమార్ గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వద్దాది పాణి కుమార్‌ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అభినందించారు. వీరితో పాటు వైసీపీ నాయకులు ఉన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న ఎమ్మెల్యే అశోక్

విశాలాంధ్ర-కవిటి : ప్రమాదం జరిగి చాలా సమయం అయినా 108 అంబులెన్స్ రాని స్థితిలో క్షతగాత్రునికి తన సొంత వాహనంలో ఆసుపత్రికి చేర్చి క్షతగాత్రుని అదుకుని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తన మంచి మనసును చాటుకున్నారు. కంచిలి మండలం తలతంపర గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కుటుంబ సమేతంగా మోటారు వాహనంపై ప్రయాణిస్తుండగా మండపల్లి గ్రామ సమీపంలో గల్లా రాఘవయ్య వ్యవసాయ క్షేత్రం దగ్గర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగి చాలాసేపు అయినప్పటికీ 108 అంబులెన్స్ రాకపోవడంతో అటువైపుగా కవిటి నుండి పలాస శుభ కార్యక్రమం కు వెళ్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అక్కడ పరిస్థితి సమీక్షించి 108 అంబులెన్స్ రాలేదు అనే విషయాన్ని తెలుసుకొని మానవతా దృక్పథంతో క్షతగాత్రునికి తన సొంత వాహనంలో ఎక్కించి ఆసుపత్రిలో చేర్పించారు. మానవత్వం చాటుకున్న ఇచ్ఛాపురం శాసనసభ్యులు డాక్టర్ అశోక్ పై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ పనితీరు పై బాధ్యత కుటుంబ సభ్యులు, స్థానికులు ధన్యవాదాలు తెలిపారు.

ఉత్తమ మహిళలకు రోటరీ జ్ఞాపికలు



విశాలాంధ్ర-ఆమదాలవలస : అనంత విశ్వంలో సృష్టికి మూలం స్త్రీ మూర్తి అని పంచభూతాలతో సమాన గౌరవంగా పూజింప బడేది స్త్రీమూర్తి అని అటువంటి వారిని గౌరవించడం సనాతన సాంప్రదాయ మని రోటరీ క్లబ్ అధ్యక్షులు పాత్రుని పాపారావు అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు సందర్భం ప్రభుత్వ జూని యర్ కళాశాల లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా మణులకు సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీలను సూర్య చంద్రులు ఉన్నంతవరకు గౌరవించాలని తెలిపారు. ఉత్తమ మహిళలుగా ఐ పద్మావతి,బి పుష్ప,వై పుష్ప, యం గృహ లక్ష్మి, యస్ లక్ష్మి లను ఉత్తమ మహిళా మణులు గా గుర్తించి వారికి దుస్సలువ లు మరియు జ్ఞాపికలు తో సత్కరించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ శ్యామ్ సుందర్ మాట్లాడుతూ మహిళలను అమితంగా గౌరవించ బడే దేశం భారత దేశం అని అందుకే అన్ని విధాలా మన దేశం అభివృద్ధి చెందిన ది అని అన్నారు. అసిస్టెంట్ గవర్నర్ జెకె వెంకట్ బాబు మాట్లాడుతూ మానవ జాతి మనుగడలో ప్రధాన శక్తి స్త్రీ యేనని, ప్రపంచం లో వున్నా ప్రతీ వ్యక్తి ఓ మహా శిల్ప%శీ% గా, భావి భారత పౌరులు గా తీర్చి దిద్దిన స్త్రీ మూర్తులకు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎస్ పి ఓ రోటేరియన్ జెకె. రవి బాబు, కార్యదర్శి పి తేజలక్ష్మి మాట్లాడుతూ మహిళలను గౌరవించే భారతదేశ సంప్రదాయం ప్రపంచ దేశాలకే గొప్పది అన్నారు. అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

'స్మాల్ సర్వీస్ టూ సొసైటీ' ఆర్థిక సాయం

విశాలాంధ్ర-అరసవల్లి : నగరంలో గల ఆదిత్య నగర్‌కు చెందిన కల్లేపల్లి రమేష్‌కు నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలు, చేతులకు శస్త్ర చికిత్స జరగటంతో అప్పటి నుండి ఇంటికే పరిమితయ్యారు. వృత్తి రీత్యా ఏ పనినీ చెయ్యలేకపోవ టంతో కుటుంబ భారంతో పాటు, వైద్యఖర్చులు కూడా అధికమవ్వడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న "స్మాల్ సర్వీస్ టూ సొసైటీ" (ఎస్ఎస్ఎస్) ఫౌండర్ కలివరపు సూర్య ప్రకాష్, వారి మిత్రుల సహకారంతో కల్లేపల్లి రమేష్ కు రూ.15,500లను అందజేసి మాట్లాడుతూ రమేష్ కుటుంబానికి అండగా మేమున్నామని, ఎవరైనా సహాయం చెయ్యాలనుకుంటే స్మాల్ సర్వీస్ టూ సొసైటీని సంప్రదించవచ్చాన్నారు. ఈకార్యక్రమంలో కలివరపు సూర్య ప్రకాష్‌తో పాటు, దేవి కృపాల్, పొదుగు చరణ్ పాల్గొన్నారు.

ఐటీడీఏ విద్యాశాఖ నిధులు స్వాహా..?

పక్కదారి పట్టిన లక్షలాది రూపాయలు..!

విశాలాంధ్ర-మందస : గిరిజన ఆశ్రమ బాలుర మరియు బాలికల ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ఉప వసతి గృహ అధికారులకు చెల్లించాల్సిన నిధులు పక్కదారి పట్టినట్లు ప్రచారం జరుగుతోంది. ఐటిడిఎ విద్యాశాఖ నిధులు స్వాహా జరగడంపై ఆశ్రమ పాఠశాలలో చర్చనీయాంశమవుతోంది. సంబంధిత శాఖాధికారులను నిలదీసే పరిస్థితులు ఉన్నప్పటికీ బిల్లుల బకాయిల చెల్లింపుల్లోను, మెను అమల్లో చేసిన తప్పులను అధికారులు ఎత్తి చూపి వేధింపులకు గురి చేస్తారన్న భయంతో ఉప వసతి గృహాధికారులు నిధుల స్వాహా వ్యవహారంపై మౌనం దాల్చుతున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. గతేడాది జరిగిన పదో తరగతి విద్యార్థుల పరీక్షలకు మందస మండలం బుడంబో గ్రామంలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ పరీక్షా కేంద్రానికి మందస మండలంలో గల అన్ని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోను చదువుకున్న పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల నుంచి యాజమాన్యాలు ప్రత్యేక వాహనాలు సమకూర్చి పరీక్ష కేంద్రానికి తీసుకువెళ్లారు. విద్యార్థుల ప్రయాణం ఖర్చులు ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉప వసతి గృహ అధికారులకు చెల్లించాల్సి ఉంది. కాని పరీక్షలు జరిగి ఏడాది కాలమైనా ఇంత వరకు చెల్లింపులు జరగ లేదని తెలుస్తోంది. వారికి చెల్లించాల్సిన ఈ సొమ్ము గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఒక ఉపాధ్యాయులు బ్యాంకు ఖాతాకు సంబంధిత శాఖ అధికార యంత్రాంగం జమ చేసినట్లు తెలుస్తోంది. ఆ ఉపాధ్యాయుడు ఖాతాకు జమ అయిన సొమ్ము ఉప వసతి గృహాధికారులకు పంచకుండా ఐటిడిఎ విద్యాశాఖ అధికారులు కుమ్మక్కై స్వాహా చేశారన్న ప్రచారం జరుగుతోంది. ఈ ఉపాధ్యాయునికి ఐటిడిఎ సంస్థ అధికారులు అండదండలు ఉన్నట్లు భోగట్టా. 10వ తరగతి గిరిజన విద్యార్థుల ప్రయాణం ఖర్చుల సొమ్ము ఒక్కొక్క పాఠశాలకు వేలాది రూపాయలు ఐటిడిఎ చెల్లించాలి. ఇలా చెల్లించకుండా ఒక ఉపాధ్యాయుని ఖాతాలో జమ చేసి అన్ని పాఠశాలలకు సంబంధించి లక్షల్లో సొమ్ము మాయమైంది. గతేడాది బుడంబో పరీక్షా కేంద్రానికి పదో తరగతి విద్యార్థులను ప్రత్యేక వాహనాల్లో తీసుకువెళ్లేందుకు ఉప వసతి గృహ అధికారులు 30వేల రూపాయలు వరకు ఖర్చు చేశారు. ఆశ్రమ పాఠశాలల్లో నెలరోజులు పాటు మెనులో కోత విధించి గుడ్లు, పాలు, విద్యార్థులకు ఇవ్వకుండా నాణ్యమైన ఆహారం పెట్టకుండా ఈ నిధులతో డెప్యూటీ వసతి గృహ అధికారులు పరీక్షలకు హాజరైన విద్యార్థులకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేశారు. మళ్లీ ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులకు బుడంబో పరీక్షా కేంద్రానికి ప్రత్యేక వాహనాల్లో తీసుకువెళ్లాలని, ఖర్చులు భరించాలని ఉప వసతి గృహ అధికారులకు అనధికార ఆదేశాలు జారీ అయినట్లు సమాచారం. దీంతో ఉప వసతి గృహ అధికారులు లబోదిబోమంటున్నారు. గతేడాది చెల్లించాల్సిన ప్రయాణం ఖర్చుల నిధులు స్వాహా చేసి చెల్లించకపోవడంతో ఈ ఏడాది తమపై ఆర్థిక భారం పడుతుందన్న భావంతో ఇప్పటి నుంచే ఉప వసతిగృహ అధికారులు, ప్రధానోపాధ్యాయులు కుమ్మక్కై గిరిజన విద్యార్థుల మెనులో కోత విధిస్తున్నారు. ఉన్నతాధికారులు చేసిన తప్పిదాలతో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెను సక్రమంగా అమలు కావడం లేదు. చర్యలు చేపట్టాల్సిన అధికారులు అవినీతికి ప్రోత్సహించి నిధులు పక్కదారికి పట్టించే అధికారులకు అండగా ఉంటే గిరిజన ఆశ్రమ పాఠశాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి

విశ్రాంత ఉపాధ్యాయుడు గున్న ప్రకాశరావు

విశాలాంధ-కవిటీ : ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేసినట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు గున్న ప్రకాశరావు తెలిపారు. ఈమేరకు గురువారం మండలంలోని బైరిపురం గ్రామంలో విశ్రాంత ఉపాధ్యాయుడు గున్న ప్రకాశరావు ఆర్థిక సహకారంతో గ్రామదేవత అఖిలేశ్వరి అమ్మవారి ఆలయం వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన వంటశాల, విశ్రాంతి భవనం ప్రతిష్టా కార్యక్రమం చేపట్టారు. అనంతరం అమ్మవారికి కుంకుమార్చన, చండీయాగం పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో దాతలు కుటుంబ సభ్యులు గున్న క్రాంతి కుమార్, గున్న విష్ణు కాంతి, గున్న శివ కాంతితో పాటు చుట్టుప్రక్కల గ్రామాలకుచెందిన భక్తులు పాల్గొన్నారు.

విత్తన గుళికలు తయారీపై అవగాహన

విశాలాంధ్ర-ఆమదాలవలస : మండలం నిమ్మతొర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది విత్తన గుళికలు తయారీ విధానాన్ని మహిళా రైతుల సమక్షంలో నిర్వహించారు. ముఖ్యంగా విత్తనాలను విత్తన కుళికలుగా మార్చి విత్తుకోవడం వలన విత్తనాలు నేలలో పాడవకుండా కొన్ని నెలల వరకు ఉంటాయి. విత్తనాలను విత్తన గుళికలుగా తయారు చేయడానికి బీజామృతం, బంక మట్టి పొడి, ఘనజీవామృతం పొడి మరియు బూడిద వాడుతారు. ప్రకృతి సేద్యంలో విత్తన గుళికలు విధానం ప్రత్యేకమైనది. వర్షాధార పరిస్థితులలో పొడి నేలల్లో విత్తనాలను విత్తన గుళికలుగా మార్చి వేసుకున్నట్లయితే ఏదైతే వర్షాలు పడతాయో ఆ సమయం వరకు విత్తనాలు నేలలో పాడవకుండా సురక్షితంగా ఉంటాయి. ఈ విధానాన్ని సీడ్ పెల్లెటైజేషన్ అని అంటారు. ఇలా చేసుకుని వేసుకోవడం వలన విత్తనాలకు నీరు అవసరం ఎక్కువగా ఉండదనీ అలాగే రైతులందరూ కూడా నీరు అందుబాటులో లేని పొలాల్లో నేలను ఖాళీగా ఉంచకుండా సీట్ బెల్లెటైజేషన్ చేసే విత్తనాలను ఎత్తుకోవాలని సిబ్బంది నక్క చిరంజీవిరావు రైతులకు వివ రించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఘనంగా అసిరితల్లి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-పొందూరు : అమ్మలగన్న అమ్మగా, ఆది పరాశక్తిగా, పిలిస్తే పలికే తల్లిగా పొందూరులో వెలసిన ఆసిరి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట అంగరంగ వైభంగాను జరుపు కున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గనతకెక్కిన అసిరి తల్లమ్మ విగ్రహ ప్రాణ ప్రతిష్ట వేద పండితుల మంత్రోచ్ఛారణాలు మధ్య దేదివ్యమానంగా జరిగాయి. ఆలయ పూజారి పోలాకి రామారావు ఆధ్వర్యంలో బుధ వారం అసిరి తల్లిని గ్రామ పురవీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మ తల్లి రథం కదులుతుండగా వందలాది మంది మహిళలు ఘటాలతో ప్రదర్శనగా అమ్మ తల్లికి స్వాగతం పలికారు. అమ్మ తల్లికి జై జై ధ్వనులు పలుకుతూ నాటి సంధ్యా సమయాన గర్భగుడికి చేసే కార్యక్రమం అద్భుతంగా నిర్వహించారు. అనంతరం అసిడితల్లి అమ్మ వారిని గర్భ గుడిలో ప్రతిష్ట వేద పండితుల మంత్రోక్షరానలు మధ్య వైభవంగా జరుపుకున్నారు. అనంతరం గురువారం అమ్మ తల్లి గర్భగుడి ప్రాంగణంలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు తల్లిని దర్శించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం : స్థానిక ఎన్జీఓ హోమ్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్జీఓ సంఘ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి గైనిక్ విభాగాధికారిణి డి. పార్వతి, జిల్లా ఆడిట్ అధికారిణి సిహెచ్. ప్రభావతి, సహాయ ఖజానాధికారిణి పి. సావిత్రి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లోను పురుషులకు ధీటుగా రాణిస్తున్న తరుణంలోనూ లింగ వివక్ష కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్ననాటి నుండే పిల్లలని వివక్ష లేకుండా తీర్చుదిద్దాలని కోరారు. రెండు రోజులు నిర్వహించిన వివిధ విభాగల్లో విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఏపీ ఎన్జీఓ సంఘ మహిళా విభాగం ఛైర్పర్సన్ హైమావతి అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో ప్రత్యేక అతిధిలుగా ఏపీ ఎన్జీఓ సంఘ రాష్ట్ర సహధ్యక్షులు చౌదరి పురుషోత్తం నాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా శ్రీనివాసరావు, జేఏసీ సహాయ కార్యదర్శి బి. మోహనరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు రాయి వేణు గోపాల్, ఎన్జీఓ సంఘ మహిళా నేతలు పి. శ్రావణి. కె. రోజా కుమారి, మమతాకుమారి బెహరా, సబినాబేగం, జి. లలిత, కె. ఉదయరేఖ, కె. నారాయణమ్మ, తాలూకా యూనిట్ల కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఎన్పేటలో : లక్ష్మీనర్సుపేట ప్రాథమిక పాఠశాల అవరణనందు లయన్స్ క్లబ్ సర్వీస్ ఛైర్ పర్సన్, దివ్యాంగ ఉద్యోగ సంఘ నాయకుడు, మానవతా సర్వీస్ ఆర్గనైజేషన్ మెంబర్ లయన్ డా॥ ఎం.కె మిశ్రో ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉమెన్ వెల్ఫేర్ సెక్రటరీ ఎం.భాగ్యలక్ష్మిని సన్మానించారు. ఈకార్యక్రమంలో హెచ్.ఎం.జి.ఎం పాత్రో, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, అంగన్వాడీ టీచర్లు ఆరుద్ర, సంగీత, విజయలక్ష్మి, వి.ఎ.ఓ.పి అప్పలరాజు,గ్రామ వాలంటీరు, తిరుపతిరావు, విద్యార్థి, విద్యార్థినులు పాల్గొన్నారు.

నరసన్నపేటలో : ప్రకృతికి మూలం మహిళని, ఆది గురువుగా పిల్లలను సరిదిద్దటంలో మహిళ ప్రథమ స్థానంలో వుంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.పి.లత అన్నారు. గురు వారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన డిప్యూటీ డిఎంహెచ్వో, డా.లక్ష్మీ తులసి మాట్లాడుతూ దేశంలో స్త్రీ, పురుష నిష్పత్తి తగ్గిపోవటానికి బృణహత్యలు కారణమని, దీని నివారణకు పిఎన్డిటి యాక్ట్-1995ను కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు ఏర్పాటు చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డా.టి.గోవిందమ్మ, స్థానిక కళాశాల వైస్ ప్రిన్సి పాల్, శాంతిహేమ్, అధ్యాపకులు, కె.రెయ్యమ్మ, పల్లవి, పవిత్ర, శ్రీవిద్య, హారిక, కృష్ణవేణి, అనూరాధ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో : మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ సందర్భంగా మహిళ ఉపాధ్యాయులు ఏ విజయలక్ష్మి, బి అరుణకుమారి, టీ రాధిక, శిరీష దేవ్లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు విశ్వనాథం, జానకిరావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలోగల చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడు గ్రామంలో శ్రీ కొత్తమ్మతల్లి ఆలయ నిర్మాణానికి వేద పడింతులు సుసరాపు చంద్రశేఖర్శర్మ ఆధ్వర్యంలో సర్పంచ్ నేతింటి చిన్నమ్మడు అప్పలస్వామిలు గురువారం భూమి పూజ, ప్రతిష్ట చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులంతా ఆలయం వేగంగా నిర్మాణం జరగాలని, గ్రామం సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి ముగ్రాటలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు సనపల కరుణ్కుమార్, హనుమంతు వెంకటరావు, మెండ తిరుపతి, నేతింటి వెంకట రావు, మెండ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ భూతాన్ని తరిమికొట్టాలి

- జెమ్స్ ఆధ్వర్యంలో మార్చి 31 వరకు ఉచిత వైద్యపరీక్షలు
- జెమ్స్ ఆసుప్రతి నెఫ్రాలజిస్ట్ ఎర్రా రాకేష్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్ : కిడ్నీ వ్యాధుల పట్ల ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, ముందస్తు వ్యాధి గుర్తింపుతోనే వ్యాధిని అరికట్టవచ్చునని జెమ్స్ ఆసుపత్రి నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఎర్రా రాజేష్ అన్నారు. గురు వారం ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నెఫ్రాలజిస్ట్ ఎర్రా రాజేష్ మాట్లాడుతూ ప్రపంచంలో 80 కోట్ల మంది కిడ్నీ వ్యాధి బాధితులు ఉన్నారని, భారతదేశంలో ప్రతీ లక్ష మందికి 80 మంది కిడ్నీ వ్యాధి బారిన పడుతున్నారని వివరించారు. అధిక రక్తపోటు, ఇతర అనారోగ్యాలు కిడ్నీ వ్యాధికి దారితీస్తా యన్నారు. మంచినీటి కాలుష్యం, షుగర్, బీపీ, అధికంగా పెయిన్ కిల్లర్స్ వాడడం వల్ల ఈ వ్యాధి బారిన పడుతున్నారని వివరించారు. వ్యాధిని ప్రారంభంలోనే గుర్తిస్తే వ్యాధిని అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. వ్యాధి ముదురుతున్న కొద్దీ మూత్రపిండ వైఫల్యానికి దారితీస్తుందని చెప్పారు. వయసుతోనే సంబంధం లేకుండా 20 ఏళ్ల వారికి కూడా మూత్రపిండాల వ్యాధి బారిన పడడం బాధాకరమన్నారు. జెమ్స్ ఆసుప్రతి వారు ఈ నెల 31 వరకు ఉచితంగా షుగర్, బీపీ, క్రియాటిన్, సీరమ్ పరీక్షలను నిర్వహిస్తున్నారని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యురాలజిస్ట్లు డాక్టర్ పట్నాన భానుమూర్తి, సిద్ధవరం శ్రీదీప్లు మాట్లాడుతూ జంక్ ఫుడ్స్కు దూరంగా ఉండాలని మారుతున్న ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతీ ఒక్కరూ వ్యాయామం చేయాలని సూచించారు. డీహైడ్రేషన్, ప్రొటీన్ పౌడర్ల వాడకం, జంక్ ఫుడ్స్ వల్ల కిడ్నీలో రాళు చేరుతున్నారని వివరించారు. మార్చి 10న జెమ్స్లో ఆరోగ్యశ్రీ ద్వారా కిడ్నీ శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు 13 కిడ్నీ మార్పిడిలు విజయవంతం జరిగాయన్నారు. ఈ శస్త్రచికిత్సలకు సికింద్రాబాద్ నుంచి ప్రముఖ వైద్యరంగ నిపుణులు రానున్నారని వివరించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల నుంచి డేఅండ్ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించి తరిమి కొడదాం తరిమికొడదాం కిడ్నీ భూతాన్ని తరిమికొడదాం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగి నాయుడు, గౌరవాధ్యక్షులు జి. ఇందిరాప్రసాద్, ఇంటాక్ కోకన్వీనర్ వావిలాపల్లి జగన్నాధం నాయుడు, డాక్టర్ ఆంచట అంజనీ, వాకర్స్ ఇంటర్నేషనల్ రీజినల్ కౌన్సెలర్ కూన వెంకట రమణమూర్తి, వాకర్స్ ప్రతినిధులు ఎస్.సంజీవ రావు, ఎస్. అప్పలనాయుడు, బొడ్డేపల్లి ప్రసాద్ రావు,ఎన్. ఈశ్వరరావు, ఎం.మల్లిబాబు,రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులు జి.వాసుదేవరావు జెమ్స్ మేనేజర్ ఆబోతుల రామ్మోహనరావు, మలిపెద్ది మల్లిబాబు, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి కళాబృందాలతో మహిళలకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర-పాతపట్నం : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సిఐ వినోద్ బాబు మరియు ఎస్ఐ ఎన్ కామేశ్వరరావు ఆధ్వర్యంలో సమాజంలో మహిళల పైన మరియు మైనర్ బాలికల పైన జరుగుతున్న అత్యాచారాలు మరియు మోసాలు అరికట్టేందుకు ఎస్పీ జి.రాధిక పంపించిన స్ఫూర్తి టీం తో పాతపట్నం, కొరసవాడ గ్రామాలలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మెలకువలను తెలియజేశారు ఈ సమావేశానికి విద్యార్థులు మహిళలు స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు : ఎస్పీ రాధిక

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం జిల్లా లోని పోలీసు అధికారులతో ప్రత్యక్షంగా, పోలీసు స్టేషన్ సిబ్బందితో జూమ్ ద్వారా పట్టభద్రుల, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబం ధించిన భద్రత ఏర్పాట్లు, సిబ్బంది నిర్వహించ వలసిన విధులు, బందోబస్తు ఏర్పాట్లపై సమా వేశం నిర్వహించి, పోలీసు సిబ్బందికి దిశనిర్దేశాలు చేశారు. ఎన్నికల విధుల గురించి, విధులు నిర్వర్తించే సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ నవీన్ పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి, పోలింగ్ రోజున నిర్వర్తించే విధుల గురించి వారికి వివరించారు. బందోబస్తు విధులు, నిర్వహణలో గల సందేహాలను నివృత్తి చేసే విధంగా సిబ్బందికి పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ, జేసీ నవీన్ శ్రీకాకుళం జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు 59 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు, ఈ ఎన్నికలకు సంబంధించి 52,256 మంది ఓటర్లు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు 4 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు, ఈ ఎన్నికలకు సంబంధించి 776 మంది ఓటర్లు నమోదైనట్లు తెలిపారు. ఎన్నికల భద్రతా విధుల కోసం మొబైల్ పార్టీలు-27, స్ట్రైకింగ్ ఫోర్స్-17, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్-04, ఫ్లయింగ్ స్క్వాడ్-30, ఎంసీసీ టీమ్స్-30, క్యూఆర్టీ పార్టీలు-02, ఆర్వోపీ పార్టీలు-06, స్ట్రాంగ్ రూమ్ గార్డ్-02, రిజర్వ్ పార్టీ-03, చెక్ పోస్టు-16 ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల రోజున మద్యం అమ్మకాలకు అనుమతి లేవు : ఎన్నికల పోలింగ్ రోజున, పోలింగ్ స్టేషన్కు 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఆ ప్రాంతంలో ఎటువంటి వాహనా లకు అనుమతించారదని, ఎన్నికల ప్రచారం నిర్వహించడం, ఎక్కువ మంది గుమిగూడటం జరుగకుండా చూడాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, ఎటువంటి సమస్యలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. లౌడ్ స్పీకర్స్ ఏర్పాటుకు అనుమతి లేదని తెలిపారు. రూట్ బందోబస్తు సిబ్బంది, పోలింగ్ సిబ్బందితో పాటుగా పోలింగ్ స్టేషన్ వరకు వెళ్లి, పోలింగ్ ముందురోజు రాత్రి అక్కడే బస చేయాలని సూచించారు. పోలింగ్ రోజున ఎవరైనా పోలింగ్ కు అడ్డంకులు సృష్టించినా, ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించినా, గొడవలకు పాల్పడినా అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. ఓటు వేసేందుకు వచ్చిన వారు తప్పని సరిగా ఎన్నికల సంఘంవారు అనుమతించిన ఒరిజినల్ గుర్తింపు పత్రాన్ని చూపించాలని, లేనియెడల వారిని అనుమతించరాదని సిబ్బందికి సూచించారు. ఎన్నికల ప్రిసైడింగ్ ఆఫీసర్ అనుమతి లేకుండా సిబ్బంది ఎవరూ పోలింగ్ కేంద్రం లోపలకు వెళ్లేందుకు అను మతి లేదని తెలిపారు. ఎన్నికల సందర్భంగా గొడవ లకు పాల్పడే వారిని గుర్తించి, వారిని బైండోవర్ చేయాలని, రౌడీషీటర్స్ కు కౌన్సెలింగ్ నిర్వహించి, ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు పాల్పడరాదని సూచించాలని అధికారులను ఆదేశించారు.

అనంతరం ఎస్పీ అపరిష్కృతంగా ఉన్న గ్రేవ్ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు, పొక్సో కేసుల దర్యాప్తుపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేసుల దర్యాప్తులో పురోగతిపై ఆరాతీసి, కేసుల విచారణ, దర్యాప్తులో మెళు కువలపై అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. ఈ కార్యక్రమంలో సమీక్షా సమావేశంలో ఆదనపు ఎస్పీ విఠలేశ్వర్ డిఎస్పీలు ఎం. మహేంద్ర, శివ రామి రెడ్డి, ఎస్ వాసుదేవ్, జి. శ్రీనివాసరావు, డి. ప్రసాద్ రావు, ప్రసాద్ రావు,ఏ.ఓ ఎం శివా రామరాజు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

స్త్రీలను గౌరవిద్దాం.. పూజిద్దాం...

ప్రాణదాత ఫౌండేషన్ పిలుపు

విశాలాంధ్ర-అరసవల్లి : స్త్రీలను గౌరవిద్దాం... పూజిద్దాం అని ప్రాణదాత ఫౌండేషన్ చైర్మన్ డోకి శ్రవణ్ కుమార్ పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళల ఇంటింటికీ గురువారం ఆయన మిత్ర బృందంతో కలసి వెళ్ళి సన్మానించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బొడ్డేపల్లి. మీనాక్షి, ప్రముఖ స్త్రీ మరియు ప్రసూతి వైద్య నిపుణులు గురువెల్లి. ప్రమీల, సత్తారు. స్రవంతి, చింతాడ నాగమల్లేశ్వరి, బగ్గు సంధ్య లతో పాటు మున్సిపల్ పారిశుధ్య కార్మికురాలు లలిత తదితరుల ఇంటికి ప్రాణదాత ఫౌండేషన్ చైర్మన్ డోకి శ్రవణ్ కుమార్ ఇతర సభ్యులు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి వారికి చీర, మిఠాయిలు, మొక్క ను అందజేసి అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో తల్లిని మించిన దైవం లేదని అటువంటి దైవంతో సమానులైన స్త్రీమూర్తులను గౌరవించడం మన సాంప్రదాయం అన్నారు. స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అక్కడ సకల దేవతలు కొలువై ఉంటారని మన పురాణాలు తెలుపుతున్నాయని ఆయన తెలిపారు. అటువంటివారిని నేడు వారి వారి ఇళ్ల వద్దకు వెళ్లి గౌరవించడం ఎంత సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ దానేటి హర్ష, పాట్నూరు ప్రతాప్ కస్యపు తదితరులు ఉన్నారు.

శిశువు మృతి సంఘటన బాధాకరం

- విచారణ జరిపి దోషులను శిక్షిస్తాం - జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త భాస్కరరావు



విశాలాంధ్ర-పలాస : పలాస ప్రభుత్వాసుపత్రిలో శిశువు మృతి సంఘటన బాధాకరమని, దీనికి బాధ్యులైన వారిని లోతుగా విచారించి దోషులను శిక్షిస్తామని జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త జె.భాస్కరరావు అన్నారు. పలాసకు చెందిన సురేష్ విజయ దంపతులకు నాలుగో సంతానంగా పుట్టిన బిడ్డ మృతిపై వస్తున్న ఆరోపణలపై గురువారం ఆసుపత్రి ఆవరణలో శాఖాపరమైన దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైద్య సేవలు అందించడంలో పలాస ప్రభుత్వాసుపత్రి మూడో స్థానంలో ఉందని, సిబ్బంది పని తీరు కూడా బాగానే ఉందని అన్నారు. ఆసుపత్రిలో మత్తు డాక్టర్, గైనికాలాజిస్టులు లేకపోయినా అధిక సంఖ్యలో ప్రసవాలు జరుగుతున్నాయని, ఇటువంటి సంఘటన గతంలో ఎన్నడూ జరగలేదని అన్నారు. సురేష్ తన భార్య విజయను ప్రసవానికై పలాస ప్రభుత్వాసుపత్రికి ఆ రోజు రాత్రి 11.40 గంటలకు తీసుకొచ్చారని, అప్పటికే కడుపు నుంచి కాళ్లు, బొడ్డు తాడు ముందుకు రావడంతో ఆ విషయాన్ని సెలవులో ఉన్న ప్రసుతి వైద్యనిపుణురాలకు స్థానిక వైద్య సిబ్బంది సమాచారం ఇవ్వడం జరిగిందని, పరిస్థితి విషమించడంతో ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారని తెలిపారు. అప్పటికే బిడ్డ మృతి చెందిందని, వాస్తవానికి బిడ్డ తండ్రి ఆరోపణలు అవాస్తవమని ప్రాథమిక విచారణలో వెల్లడైందని అన్నారు. ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించడం లేదనే వార్తలు వినిపిస్తే తక్షణమే సంబంధిత వైద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రభుత్వ వైద్యులు అందుబాటులో ఉండాలని, అత్యవసర సమయంలో వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఈ సమావేశంలో పలాస ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ భవానీశంకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.హెచ్.చిన్నంనాయుడు, వైద్యులు ఎన్.కూర్మారావు, మేఘనలు పాల్గొన్నారు.

గోరుముద్దలో ప్రమాణాల పెంపు

- హైజినిక్ వంటకంతో అక్షయ పాత్ర

విశాలాంధ్ర-ఆమదాలవలస : విద్యార్థులకు తినేందుకు అనుకూలంగా ఉండే విధంగా నాణ్యతా ప్రమాణాలను పాటించి పాఠశాల విద్యార్థులకు గోరుముద్ద అందిస్తున్నారు. ఇటీవల బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పరిశీలనలో కొన్ని నాణ్యత లోపాలను ఇస్కాన్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు వివరించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే పథకాన్ని విద్యార్థులందరూ తినే విధంగా ఉండాలని చెప్పడంతో అక్షయపాత్ర నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులకు అనుకూలమైన రుచిగా అందిస్తున్నారు. ఇటీవల పది రోజులుగా ప్రభుత్వం ఇచ్చిన మెనూ మేరకు విద్యార్థుల మనోగతాలను తెలుసుకొని అందరికీ ఇష్టపడే విధంగా ఆహార పదార్థాలు అందిస్తున్నారు. ప్రతిరోజు అక్షయపాత్ర నుంచి ఆముదాలవలస, శ్రీకాకుళం, గార మండలాల్లోని 309 పాఠశాలలకు సుమారు 22 వేల మంది విద్యార్థులకు, మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఆహారాన్ని అందిస్తున్నారు. ఇందుకుగాను 17 రూట్లుగా విభజించి వాహనాలను ఏర్పాటు చేశారు. పదార్థాలు వేడిగా ఉండేందుకు హాట్ బాక్సుల్లో విద్యార్థులకు అందించేవారు. అయితే వెంటనే మూత పెట్టడంవలన కొంచెం మెత్తగా అయినట్లు గమనించిన అక్షయపాత్ర ప్రతినిధులు సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యంలో స్వల్ప తేడాలు ఉండడం కారణంగా సుంకు వాసన వచ్చేదని వాటిని కూడా సక్రమంగా పరిశీలించి అందిస్తున్నామని అక్షయపాత్ర ప్రతినిధులు తెలిపారు. రోజువారి మెనూ ప్రకారం శాంపిల్లను ఎంఈఓ కార్యాలయానికి అందించి వారి వద్ద నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నట్లు తెలిసింది. ప్రతిరోజు విద్యార్థులను చైతన్య పరుస్తూ వారికి అనుకూలమైన విధంగా ఆహా రాన్ని తయారు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకంలో గోరుముద్ద తినే విధంగా చర్యలు తీసు కుంటు న్నామని తెలిపారు. ఇస్కాన్ స్వచ్ఛంద సంస్థ నాణ్యతల విషయంలో రాజీ పడేది లేదని దాతలు అందించే వాటిని స్వచ్ఛందంగా విద్యార్థులకు అనుకూలమైన రుచితో అంది స్తామని స్పష్టం చేశారు. అలాగే విద్యార్థులు తల్లిదండ్రులతో పాఠశాల వద్ద అందరు విద్యార్థులు భోజనాలు చేసే విధంగా ఉపా ధ్యాయులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎక్కువగా కొంతమంది ఉద్యోగుల పిల్లలు గోరుముద్ద అందిస్తున్న ఆహారం తీసుకునేందుకు అయిష్టత చూపుతున్నట్లు తెలిసింది. వీటి పైన కూడా పాఠశాల ఉపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, స్థానిక ఎమ్మార్వోలు సమన్వయంతో వ్యవహరించి విద్యార్థులకు చైతన్య కల్పించాల్సి ఉంది. హక్కుల కమిషన్ చూచించిన విధంగా అక్షయపాత్ర అధికారులు మార్పులు చేస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్య పరచవలసి ఉంది.

ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి మాధవ్ను గెలిపించాలి

విశాలాంధ్ర-పలాస : ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గ ఎన్నికల్లో బిజెపి నాయకులు పి.వి.ఎన్ మాధవ్ గెలుపు కోసం క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ ఆయన విజయానికి కృషి చేయాలని పలాస నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల బిజెపి విస్తారక్ పిక్కి నాగేంద్ర అన్నారు. గురువారం పలాసలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి.వి.ఎన్ మాదవ్ ప్రధాన మంత్రి నరేంద్రమోడి గారితో నేరుగా సత్సంబంధాలు ఉన్న కారణంగా ఉత్తరాంధ్ర పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయడం జరుగుతుందని, ఎమ్మెల్సీగా పని చేసిన మొదటిసారి ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేయడం జరిగిందని అన్నారు. గత శాసనమండలి ఎన్నికల్లో వచ్చిన హామీలన్ని నెరవేర్చడం జరిగిందని, ఉత్తరాంధ్ర సంపూర్ణ అభివృద్ధి సాధించడానికి బిజెపి ద్వారా మాదవ్ గళం బలంగా పలుకుతుందని అన్నారు. తండ్రి చలపతి నుంచి నాయకత్వం లక్షణాలను అందిపుచ్చుకొని క్రమశిక్షణతో పోరాటం చేస్తున్న మాదవ్ను గెలిపించాలని కోరారు. పట్టణ అధ్యక్షులు పాలవలస వైకుంఠరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వామీజీ బాలక్రిష్ణ, హరిక్రిష్ణ, ధర్మారావు, శ్రీనివాసరావు, పద్మకుమార్, మోహనరాజు, రామారావు, జగదీశ్వరరావు, పీరాస్వామి, బాబ్జీలు పాల్గొన్నారు.

పోలింగ్పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి

- పిఓలు, ఎపిఓలు పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి
- రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: పోలింగ్ పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన మాన్యువల్ ను క్షుణ్ణంగా చదివి అర్థంచేసుకొని విధులను విజయవంతంగా నిర్వహించాలన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించిన జోనల్ అధికారులు, పిఓలకు, ఏపీఓలకు జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలు, పట్టభద్రుల ఎన్నికల్లో పోలింగ్కు సంబంధించి పూర్తి స్థాయిలో అవగాహన ఉన్ననాడే ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి చెప్పేందుకు అవకాశం ఉంటుందన్నారు. వెబ్ కెమెరాలు సరియైన స్థానంలో ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రంలో ఏమి జరిగినా ప్రెసైడింగ్ ఆఫీసర్ దే బాధ్యతన్నారు. శ్రీకాకుళం డివిజన్ కు సంబంధించి శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల, టెక్కలి డివిజన్ కు సంబంధించి సబ్ కలెక్టర్ కార్యాలయం, పలాస డివిజన్కు సంబంధించి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బంది రిపోర్టు చేయాల్సి ఉంటుందని వివరించారు. రిసెప్షన్ సెంటర్కు పోలింగ్ బాక్స్లు తీసుకువెళ్లినపుడు అవసరమనుకుంటే పోలింగ్ సిబ్బంది ప్రెసైడింగ్ అధికారులతో వెళ్లాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద గొడవలు లేకుండా పోలింగ్ జరపాల్సిన బాధ్యత ప్రిసైడింగ్ అధికారులదేనన్నారు. జోనల్ అధికారులు రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం తెలియజేయాల న్నారు. భారత ఎన్నికల సంఘంవారు ఎన్నికల నియమావళిపై రూపొందించిన మాన్యువలను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకొని పిఓలు, ఎపిఓలు పొరపాట్లకు తావివ్వకుండా పోలింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. పోలింగ్కు సంబంధించిన పోలింగ్ మెటీరియల్ మొదలుకొని బ్యాలెట్ బాక్సులు సీల్ చేసేంత వరకు జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. ఎన్నికల పోలింగ్ మార్చి 13న జరగనున్నాయని పోలింగ్ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 వరకు ఉంటుందని వెల్లడించారు. పోలింగ్ రోజున బ్యాలెట్ బాక్స్ల నిర్వహణ, బ్యాలెట్ పేపర్లు, పిఓ డైరీ, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లకు సీల్ వేయుట, తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పిఓలు, ఏపీఓల ద్వారా ప్రత్యక్షంగా బ్యాలెట్ బాక్స్ను ఓపెన్ చేయించి, పోలింగ్ అనంతరం ఎలా సీల్ చేస్తారో అలాగనే పిఓలు, ఏపీఓలతో రిటర్నింగ్ అధికారి సీల్ చేయించారు. పోలింగ్ ప్రక్రియ మొదలు అయినప్పటి నుండి సాయంకాలం బ్యాలెట్ బాక్సులు సీల్ అయ్యేంతవరకు నిరంత రంగా వీడియో కవరేజ్ నిర్వహించాలన్నారు. పోలింగ్ కేంద్రంలోనికి ఓటు హక్కు కలిగిన ఓటర్లు, ఎన్నికల పరిశీలకులు, పోటీలో ఉన్న అభ్యర్థి, ఎన్నికల అథారిటీ లెటర్ కలిగిన వారు మాత్రమే లోపలికి రావచ్చున్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ఫోన్లు కానీ పెన్నులను కానీ అనుమతించరాదన్నారు. అనంతరం అక్కడే ఏర్పాటుచేసిన మాక్ పోలింగ్లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పాల్గొని సీటుసీటుకు వెళ్లి పోలింగ్కు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రణస్థలం, గార తహసీల్దార్లు జోనల్ అధికారులు, ప్రెసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రెసైడింగ్ అధికారులకు పట్టబధ్రులు, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పిస్తూ బ్యాలెట్ పేపర్లను ఎలా వినియోగించాలి, ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను ఏజెంట్లకు చూపించి ప్రొసీడింగ్ ఆఫీసర్స్ ఏజెంట్లు సంతకాలు చేసిన పేపర్స్ తో సీల్ చేయాలన్నారు. పోలింగ్ ప్రక్రియ అనంతరం కూడా ఏజెంట్ల సమక్షంలోనే సీల్చేసి సంతకాలు తీసుకొని రిసెప్షన్ సెంటర్కు బ్యాలెట్ బాక్స్లను చేర్చాలన్నారు అదేవిధంగా పిఓ డైరీ, ఇతర ప్రొఫార్మాలను అందజేయాలన్నారు. అనంతరం పోలింగ్ నిర్వహణపై పిఓ, ఎపిఓలకు పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, కొవ్వాడ ఎస్.డి.సి మురళీ కృష్ణ, డి.ఆర్.డి.ఎ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, డి.పి.ఓ రవికుమార్, జిల్లా పరిషత్ సి.ఇ.ఓ వెంకట్రామన్, జోనల్ అధికారులు, పిఓలు, ఎపిఓలు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నడోకులపాడు ముఖద్వారం ప్రారంభం



విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : మండలం చిన్నడోకుల పాడు గ్రామంలో శ్రీ పెద్దమ్మతల్లి ముఖ ద్వారం గురువారం వేదపండితులతో ప్రారంభించారు. ఈ ముఖద్వారం నిర్మాణం కోసం గ్రామస్తులు కొంతమంది దాతలు సహకారం నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు. అనంతరం అన్నదానంలో కార్యక్రమంలో ప్రజలు అధిక పాల్గొన్నారు.